పోస్టల్ సూపరింటెండెంట్‌గా విజయజ్యోతి

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 14: కర్నూలు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా ఎస్.విజయజ్యోతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను ప్రధాన తపాలా కార్యాలయంలో డివిజనల్ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు తీసుకున్న విజయజ్యోతికి ఏఎస్పీలు, అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు కర్నూలుకు
సీఎం జగన్

● చెట్ల కొమ్మలు నరికివేత ● కిలోమీటర్ల మేర బారికేడ్లు


రహదారి వెంబడి ఇనుప బారికేడ్లు



కల్లూరు, ఫిబ్రవరి 14: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం కర్నూలులో పర్యటించనున్నారు. గురువారం ఉదయం 9:30 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి కర్నూలు చేరుకుంటారు. నగరంలోని బళ్లారి రోడ్డు కింగ్ ప్యాలెస్ కన్వెన్షన్‌లో జరిగే ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మనవడి వివాహానికి సీఎం హాజరవుతారు. నూతన వధూవరులను ఆశీర్వదించి తిరిగి మధ్యాహ్నం తాడేపల్లి చేరుకుంటారు. సీఎం పర్యటన ఏర్పాట్లలో భాగంగా అధికారులు హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. కోడుమూరు రహదారి వెంట ఉన్న చెట్ల కొమ్మలను అడ్డంగా నరికేశారు. అదేవిధంగా సీఎం సెక్యూరిటీ భద్రతా పరమైన చర్యల్లో భాగంగా హెలిప్యాడ్ నుంచి రహదారి వెంబడి ఇనుప బారికేడ్లను ఏర్పాటు చేశారు.


టీడీపీతోనే మైనార్టీల అభివృద్ధి

శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్

గూడూరు, ఫిబ్రవరి 14: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీల అభివృద్ధి సాధ్యమని మాజీ శాసన మండలి చైర్మన్ షరీఫ్ అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలో కోడుమూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి ముస్లింల ఆత్మీయ సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిధిగా మాజీ శాసన మండలి చైర్మన్ షరీఫ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో ముస్లింలపై దాడులు ఎక్కువయ్యాయని అన్నారు. వైసీపీ హయాంలో ముస్లిం, మైనార్టీల సంక్షేమం కోసం నిధులు మంజూరు కాలేదని తెలిపారు. షాదిఖానాలకు నిధులు లేవని, రంజాన్ తోఫా అసలే లేదన్నారు. ఇలా ముస్లిం మైనార్టీల పథకాలకు గండికొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలందరూ టీడీపీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కోడుమూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల అభివృద్ధి మరిచిందని అన్నారు. వైసీపీ పాలనకు ముస్లిం మైనార్టీలందరూ చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు ఎస్ఏ సలీం, మైనార్టీ ప్రధాన కార్యదర్శి మనన్ బాషా, మండల, పట్టణ టీడీపీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, గజేంద్రగోపాల్ నాయుడు, అధికార ప్రతినిధి ధండు సుందర్‌రాజు, మదార్‌సాహెబ్, సులేమాన్, ఇంతియాజ్, రఫూఫ్, రెహిమాన్, మహిళా నాయకురాలు ముంతాజ్‌బేగం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్

డ్రోన్లతో పిచికారి ఎప్పుడు?



● వ్యవసాయంలో సాంకేతికత ఒట్టి మాటే
● మూడేళ్లుగా ముందుకు సాగని పనులు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 14:
వ్యవసాయంలో సాంకేతికతను పెంచితే సాగు ఖర్చు తగ్గుతుంది. ఆ దిశగా వైసీపీ ప్రభుత్వం చేస్తున్న వాగ్దానాలకు లోటు లేదు. మూడేళ్ల కిందట సాగు ఖర్చు తగ్గించడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కిసాన్ డ్రోన్ల పథకాన్ని అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ సమాయత్తమైంది. అయితే.. ఈ మూడేళ్లలో ఈ పథకం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మెకనైజ్‌డ్ అగ్రికల్చర్ పథకం కింద ఉమ్మడి జిల్లాలో 30 మండలాల్లోని రైతులకు దాదాపు రూ.9 కోట్ల ఖర్చుతో 90 డ్రోన్లను పంపిణీ చేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు మూడేళ్లుగా విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. ఇదంతా నిజమే అని రైతులు నమ్మారు. కేవలం అవగాహన సమావేశాలతోనే వ్యవహారం ఆగిపోయింది. యూనిట్ కాస్ట్ ఎక్కువ కావడం, బ్యాంకు రుణాలకు వడ్డీలో సబ్సిడీ లేకపోవడం, డ్రోన్లను ఆపరేట్ చేసేందుకు శిక్షణ తీసుకోవాల్సి రావడం, వీటన్నింటికి మించి డ్రోన్లను వినియోగించేందుకు రక్షణ శాఖ నుంచి లైసెన్సు తీసుకోవాలనే నిబంధన ఉండటంతో రైతులు కిసాన్ డ్రోన్లపై ఆసక్తి చూపడం లేదు.

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ మొదటి ప్రాధాన్యత రైతులకు ప్రయోజనం చేకూర్చడమే అని ఆర్భాటంగా ప్రకటించారు. పంటల సాగులో రైతులు ఇబ్బంది పడకుండా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేందుకు కిసాన్ డ్రోన్ల పథకం తీసుకొచ్చారు. మూడేళ్లుగా ఈ పథకం అమలులో ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని రైతులు అంటున్నారు. దీంతో రైతులు ఈ కిసాన్ డ్రోన్ల పథకంపై ఆశ వదులుకున్నారు. మెకనైజ్‌డ్ అగ్రికల్చర్ పథకం కింద ఉమ్మడి జిల్లాలోని దాదాపు 30 మండలాల రైతులకు రూ.9 కోట్లతో 90 డ్రోన్లను పంపిణీ చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు గత మూడేళ్లుగా సభలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నారు. అయితే ఇప్పటి దాకా ఈ పథకం పనులు ఏ మాత్రం ముందుకు వెళ్లడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.



● మొక్కుబడిగా శిక్షణ

కర్నూలు జిల్లాలో కిసాన్ డ్రోన్ల పథకానికి మండలానికి మూడు డ్రోన్ల పంపిణీ చొప్పున రైతు సంఘాలకు పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ యంత్రాంగం నిర్ణయించింది. 184 రైతు సంఘాలను ఏర్పాటు చేశారు. మొదటి దశ కింద 20 సంఘాలను ఎంపిక చేశారు. ఈ 20 సంఘాలకు సంబంధించి కేవలం 9 మంది యువ రైతులకు డ్రోన్లను నడిపేందుకు అవసరమైన శిక్షణ గుంటూరులోని లాంఫామ్ వ్యవసాయ క్షేత్రంలో ఇచ్చారు. అదే విధంగా నంద్యాల జిల్లాలో 75 గ్రూపులను ఏర్పాటు చేశారు. మొదటి విడత 20 గ్రూపులను ఎంపిక చేసి కేవలం 12 మంది యువ రైతులకు డ్రోన్లను నడపడంలో శిక్షణ ఇచ్చారు. కర్నూలు, నంద్యాల జిల్లాలో 21 మందికి శిక్షణ ఇచ్చారే గానీ.. ఇప్పటి దాకా ఎంపిక చేసిన గ్రూపులకు డ్రోన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిసాన్ డ్రోన్ పథకం ద్వారా రైతులకు రైతులకు పంట పొలాల్లో తెగుళ్ల, పురుగుల నివారణను సత్వరమే చేపట్టేందు కోసం డ్రోన్ల వినియోగాన్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే పథకాన్ని సకాలంలో రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు ఎటువంటి సన్నాహాలు చేపట్టలేదు.

ఆసక్తి చూపని రైతులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 70 శాతం మంది రైతులు చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. పదెకరాల కంటే ఎక్కువ పొలం ఉన్న రైతులు కేవలం 20 శాతం మంది మాత్రమే. 4-5 ఎకరాలకు తక్కువ విస్తీర్ణం ఉన్న రైతులు ఈ డ్రోన్ల వినియోగంపై పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. కిసాన్ డ్రోన్ పథకంపై జిల్లా వ్యవసాయ శాఖ యంత్రాంగం వచ్చే ఖరీఫ్ సీజన్‌కు అవగాహన కార్యక్రమాలను వంద శాతం పూర్తి చేసి డ్రోన్ల వినియోగాన్ని ఆచరణలోకి తెస్తున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటన జారీ చేసింది. అయితే.. రైతులు మాత్రం వీటి వినియోగంపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. యూనిట్‌లోని ప్రతి రైతు రూ.20వేల చొప్పున పెట్టుబడి పెట్టాలన్న నిబంధన తేవడం, బ్యాంకు రుణానికి, వడ్డీకి సబ్సిడీ లేకపోవడం, 36 నెలల్లో రుణం తీర్చాలనడం మొదలైన నిబంధనలు ఉండటంతో రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. మరోవైపు డ్రోన్ ఆపరేటింగ్‌కు ఇంటర్ చదివిన రైతులకే అవకాశం కల్పిస్తామనడంతోపాటు శిక్షణకు ఎక్కువ రోజులు వెచ్చించేందుకు రైతులు ఉత్సాహం చూపడం లేదు. కపోవడం వంటి కారణాలు కూడా ఉన్నాయి.

రూ. 9 కోట్లతో 90 డ్రోన్ల పంపిణీకి సన్నాహాలు

రాష్ట్ర వ్యాప్తంగా 2వేల డ్రోన్లను పంపిణీ చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కిసాన్ డ్రోన్ల పథకాన్ని అమలు చేయాలని అనుకుంది. ప్రతి జిల్లాలో మండలానికి 3 డ్రోన్ల చొప్పున కిసాన్ డ్రోన్ హైరింగ్ సెంటర్లు (కేడీసీహెచ్‌సీ)ల ద్వారా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో డ్రోన్ ధర రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని అధికారులు తెలిపారు. ఐదుగురు రైతులను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి కమ్యూనిటీ హైరింగ్ గ్రూపు (సీహెచ్‌సీ) ఏర్పాటు చేస్తారు. ఈ గ్రూపునకు రూ.10 లక్షల విలువ చేసే డ్రోన్‌ను పంపిణీ చేస్తారు. ఇందు కోసం ఐదుగురు ఒక్కొక్కరు రూ.20వేల చొప్పున మొత్తం రూ.లక్ష పెట్టుబడి పెట్టాల్సి ఉంది. వీరికి బ్యాంకు రుణానికి ప్రభుత్వమే పూచిగా ఉండి ఇప్పిస్తుంది. మిగిలిన రూ.4 లక్షలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడిగా అందిస్తాయని అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ఈ సబ్సిడీని భరిస్తాయి. రైతులు తీసుకున్న రూ.5లక్షల రుణాన్ని 36 నెలల్లో కంతుల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఈ డ్రోన్‌ను సంఘాలు ఇతర రైతులకు అద్దె ప్రాతిపదికన పంపడం జరుగుతుంది. అద్దెలో వచ్చే లాభంతో బ్యాంకు రుణాలు తీర్చవచ్చు.

ఈ సంవత్సరమే డ్రోన్లను వినియోగంలోకి తెస్తాం

రైతులు పంటల సాగులో ఎన్నెన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం డ్రోన్ల ద్వారా రసాయన మందులను పిచికారి చేస్తే తెగుళ్లను అరికట్టవచ్చని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సంవత్సరం డ్రోన్లను వినియోగంలోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.
- వరలక్ష్మి, జేడీ

దొంగ ఓట్లు

● ఆధార్ మార్చి మైనర్‌కు ఓటు హక్కు
● మాజీ వలంటీర్‌కు రెండు ఓట్లు
● అలసందగుత్తిలో ఇలాంటివి ఎన్నో..


తప్పుల తడకగా ఉన్న ఓటర్ల జాబితా


జంబులంబాకు ఓటు హక్కు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 14 : ఆదోని నియోజకవర్గంలో అధికార వైసీపీ దొంగ ఓట్ల నమోదుకు తొక్కని అడ్డదారి లేదు. ఓ బాలికకు ఆధార్‌లో డేట్ ఆఫ్ బర్త్ మార్పు చేసి ఓటు నమోదు చేయించారు. కర్ణాటకలో ఉండే వారికి ఆంధ్రాలో ఓట్లు ఉండేలా చేశారు. విచారించి తొలగించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆదోని మండలం అలసందగుత్తి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు రాజన్న తన కోడలైన బంగారప్ప జంబులంబా ఆధార్ కార్డులో డేట్ ఆఫ్ బర్త్ మార్చి ఓటు హక్కు వచ్చేలా చేసుకున్నాడు. అయితే గ్రామానికి చెందిన బంగారప్ప జంబులంబా 2013 డిసెంబరు 11వ తేదీన ఆధార్ కార్డు దిగింది. అందులో డేట్ ఆఫ్ బర్త్ 2009 డిసెంబరు 12న జన్మించినట్లు ఉంది. దీని ప్రకారం ఆ బాలికకు నేటికి వయస్సు 15 సంవత్సరాలు ఉంటుంది. సదరు జంబులంబాకు వైసీపీ నాయకుడు రాజన్న కొడుకు తిమ్మరాజుకు ఏడాది క్రితం వివాహమైంది. అయితే జంబులంబాకు 2023 డిసెంబరు 25న మళ్లీ ఆధార్ కార్డు దించి అందులో 2005 మే 12వ తేదీన జన్మించినట్లు డేట్ ఆఫ్ బర్త్ మార్పించాడు. ఇలా చేయడంతో ఆ బాలిక వయస్సు 19 సంవత్సరాలుగా నమోదు కావడంతో ఓటు హక్కుకు అర్హత సాధించింది. ప్రస్తుతం జంబులంబాకు 94వ బూత్‌లో ఆర్‌టీఎం 2551158 కింద ఓటు హక్కు నమోదైంది. విషయం తెలుసుకున్న తెలుగుదేశం నాయకులు బుద్దారెడ్డి, నలకలకొండ ప్రతాప్, సోమేష్, వీరేష్‌లు రాజకీయ పార్టీల సమావేశంలో సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

మాజీ వలంటీర్‌కు..: అలసంద గుత్తి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రంగారెడ్డి కోడలు సిద్దంగారి వేదవతి గ్రామ వలంటీర్‌గా విధులు నిర్వహించేది. ఏడాది క్రితం సదరు వేదవతి పెళ్లి చేసుకొని హాలహర్వి మండలానికి వెళ్లిపోయింది. ఈమె ఓటు తొలగించకపోగా ఇంటి నెం.2/34, ఆర్‌టీఎం 1584218 గల ఓటరు ఐడీతో 93,94 పోలింగ్ కేంద్రాల్లో ఒకే పేరుపై రెండు ఓట్లు ఉన్నాయి.

వీరు గ్రామస్థులే కాదు... : అలసందగుత్తి గ్రామంలో ఇంటి నెం.1-677/64, ఆర్‌టీఎం 1577816 నెం. ఐడీతో ముక్తి జిలేఖాబీవై, ఇంటి నెం. 4/177-130 ఆర్‌టీఎం 2400745 ఐడీతో శేక్ అహ్మద్ హబ్, ఇంటి నెం. 12/703/2, ఆర్‌టీఎం 2401545 ఐడీతో సాయి దీదక్ జేపీ, ఇంటి నెం. 17/151-40, ఆర్‌టీఎం 2400703 గల ఐడీతో విజయలక్ష్మి, ఇంటి నెం.21/45 ఆర్‌టిఎం 2397701 గల ఐడీతో రామకృష్ణ కొత్తలకు ఓటు హక్కు ఉంది. కానీ వీరు గ్రామస్థులు కాదు. వైసీపీ నాయకులు కొత్త ఐడీలను క్రియేట్ చేసి దొంగ ఓట్లను నమోదు చేశారని గ్రామంలో చర్చ జరుగుతోంది. దీంతోపాటు మండల పరిధిలోని సంతేకూడ్లూరు గ్రామంలో ఇంటి నెం.5/35లో దాదాపు 16 ఓట్లు ఉన్నాయి. ఇందులో సగం మంది కర్ణాటకలో, మిగిలిన వారు ఆదోనిలో స్థిరపడ్డారు. అయినా వీరికి గ్రామానికి చెందిన ఓటరు లిస్టులో పేర్లు ఉన్నాయి.

పోటా పోటీ..!

● మార్లమడి రోడ్డుకు భూమి పూజ
● ఒకే రహదారికి వేర్వేరుగా చేసిన మంత్రి జయరాం, విరుపాక్షి

హొళగుంద, ఫిబ్రవరి 14: మార్లమడి రోడ్డుకు భూమి పూజ చేయడానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఆలూరు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త బూసినేని విరుపాక్షి పోటీ పడ్డారు. వీరిద్దరు బుధవారం ఒకే రోడ్డుకు వేర్వేరుగా భూమి పూజ చేయడం చర్చనీయాంశంగా మారింది. హొళగుంద మండలంలోని మార్లమడికి పంచాయతీ రాజ్ ప్లాన్ నిధుల కింద (పీఆర్ఆర్) రూ.5.34 కోట్లు మంజూరయ్యారు. సుగుణ కన్‌స్ట్రక్షన్ అనంతపూర్ నిర్మాణ సంస్థ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టింది. ఈ పనులను ప్రారంభించేందుకు విరుపాక్షి, మంత్రి జయరాం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం సిద్ధమయ్యారు. దీంతో ఉదయం 9:30 గంటలలకు విరుపాక్షి తన అనుచర వర్గంతో రోడ్డు పనులకు భూమి పూజ చేసి వెళ్లిపోయారు. 10:30 గంటలకు కార్మిక శాఖ మంత్రి జయరాం వచ్చి రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్లమడికి గ్రామానికి వెళ్లడానికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారని, దీనిని దృష్టిలో ఉంచుకొని రోడ్డు నిర్మాణం పనులు వేగవంతం చేయాలని సదరు కాంట్రాక్టర్ రఘునాథ రెడ్డి, డీఈఈ వెంకట్ ప్రసాద్‌కు మంత్రి సూచించారు.

అధికారం వచ్చిందని అత్యుత్సాహం చూపిస్తున్నారు

ఒకే రోడ్డుకు ఇద్దరు నాయకులు భూమి పూజ చేయడంపై విలేకరులు ప్రశ్నించగా, మంత్రి జయరాం మాట్లాడుతూ కొందరికి ఇప్పుడు అధికారం వచ్చిందని అత్యుత్సాహం చూపిస్తున్నారని, అది మంచి పద్ధతి కాదని, తాను పదేళ్లుగా అధికారంలో ఉన్న ఎవరికీ ఇబ్బంది పెట్టలేదని, దీనిని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని అన్నారు. జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి మరోసారి అధికారం తీసుకొస్తుందని తెలిపారు.


ఉదయం 9:30 గంటలకు రహదారి పనులను ప్రారంభిస్తున్న ఆలూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త విరుపాక్షి


ఉదయం 10:30 గంటలకు అదే రహదారికి భూమిపూజ చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం, ఆయన అనుచరులు

తలలు పట్టుకున్న పోలీసులు

అధికార పార్టీకి చెందిన నాయకులు కావడంతోపాటు అటు మంత్రి, ఇటు ఇన్‌చార్జి కావడంతో పాటు ఇద్దరు ఒకే కార్యక్రమంలో పాల్గొంటుండటంతో, ఇరువర్గాల వారు ఎదురై గొడవలు జరిగే అవకాశం ఉండడంతో పోలీసులు తలలు పట్టుకున్నారు. ఇద్దరి కాన్వాయి ఎదురెదురు కాకుండా వీరుపాక్షిని సులువాయి మీదుగా ఆలూరు వెళ్లేలా సూచించారు. మంత్రి కన్వాయి ఎల్లార్తి మీదుగా హొళగుందకు రావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు, ఆస్పరి సీఐలు వెంకటేశ్వర్లు, హనుమంతు, హొళగుంద, ఆలూరు, హాలహర్వి ఎస్సైలు పెద్దయ్యనాయుడు, ఓబులేసు, నరేంద్ర పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఉద్యోగుల నిరసన

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని జిల్లా ఏపీ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలపై కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా కలెక్టర్ జి.సృజనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఏపీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి రూ.2 లక్షల నుంచి 4 లక్షల వరకు బకాయిలు చెల్లించాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వంలో ఒక భాగమేనని గుర్తించాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఫుల్‌టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. జడ్పీ యాజమాన్యంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ల్యాబ్ అసిస్టెంట్లు పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించాలి. ప్రతి నెల 1వ తేదీన జీతాలు ఇవ్వాలని, పదవి విరమణ పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులను వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనలు 17న తాలుకా కేంద్రంలో ధర్నా, 20న ర్యాలీ, 21 వరకు రాష్ట్ర నాయకుల జిల్లాల పర్యటన, 27న చలో విజయవాడ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు కాశన్న, జవహర్, గోకారి, నవీన్, రంగన్న, మద్దిలేటి పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న జిల్లా ఏపీ జేఏసీ నాయకులు

ఎడారిలా తుంగభద్ర



తుంగభద్ర నదిలో నీరు లేక నెర్రలిచ్చిన భూమి

కోసిగి, ఫిబ్రవరి 12: గత 20 ఏళ్లలో ఎన్నడూ తుంగభద్ర నదిలో నీరు ఇంకిపోలేదు. ఎప్పుడూ నీటితో కళకళలాడే తుంగభద్ర ఈసారి మాత్రం ఎడారిగా మారింది. తుంగభద్ర నదిని నమ్ముకున్న సాతనూరు, తుమ్మిగనూరు, కందుకూరు, కడిదొడ్డి, అగసనూరు తదితర గ్రామాల రైతులు ఎప్పటిలాగే వరి నాట్లు వేసుకున్నారు. అయితే.. నీరు లేకపోవడంతో వేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయి. డిసెంబరులోనే నదిలో నీరు లేక ఎండిపోవడంతో పొలాల్లో వేసిన వరి పైర్లు ఎండిపోయాయి. పచ్చగా కనిపించే నదితీర పొలాలు నేడు కళావిహీనంగా కనిపిస్తున్నాయి. దీంతో నదితీర ప్రాంతాల రైతులు ఇతర ప్రాంతాలకు వలసబాట పట్టారు.

నీరు లేక ఎండిపోయిన వరి పైర్లు



గడ్డి పెరిగిన తుంగభద్ర నది



రాళ్లగుట్టలతో దర్శనమిస్తున్న తుంగభద్ర నది

సహకార బ్యాంకును ప్రగతిపథంలో నడిపిద్దాం

● త్వరలో కంప్యూటీకరణ పూర్తి

● కేడీసీసీ బ్యాంకు సీఈవోగా బాధ్యతలు చేపట్టిన శివలీల

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 14: కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ సహకారంతో అన్ని విధాలా ముందుకు వెళతామని, సహకార బ్యాంకును పాలక మండలి సహకారంతో ప్రగతిపథంలో నడిపిస్తామని ఉమ్మడి కర్నూలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో శివలీల తెలిపారు. బుధవారం బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహరిని కలిసి బ్యాంకు అభివృద్ధిపై వివిధ కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకుల కంటే మిన్నగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రైతులకు ప్రభుత్వం ఎక్కువ ప్రయోజనం చేకూర్చేందుకు కృషి చేస్తున్నదని సీఈవో శివలీల తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ సక్రమంగా, వేగంగా జరుగుతోందని అన్నారు. ఈ కంప్యూటరీకరణ పూర్తయితే.. రైతులకు అన్ని కార్యక్రమాలు పారదర్శకంగా, వేగవంతంగా అమలు చేసేందుకు సాధ్యపడుతుందన్నారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని సహకార శాఖ, జిల్లా సహకార బ్యాంకు పర్యవేక్షణలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రస్తుతం డేటా ఎంట్రీ వేగంగా జరుగుతున్నదన్నారు. ఈ విషయంలో ప్రతిరోజు ప్రిన్సిపల్ సెక్రటరీ రివ్యూ చేస్తున్నారని, ప్రతి సహకార సంఘం చైర్మన్ ఈ కంప్యూటీకరణకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం వల్ల రైతుల ఆర్థిక లావాదేవీల నిర్వహణ సక్రమంగా జరుగుతుందని తెలిపారు.



కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహరిని కలిసిన సీఈవో శివలీల

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 14: జిల్లాలోని ఆలయాలకు ధర్మకర్తలను నియమించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. దిన్నెదేవరపాడు రూపాల సంగమేశ్వరస్వామి, ఆదోని మండలం కోట వీరభద్ర స్వామి దేవస్థానం, వెంగళాపురం ఆంజనేయస్వామి దేవస్థానం, అంబా భవాని దేవస్థానం, కౌతాళం మండలం ఉప్పరహల్ గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవస్థానాలకు నూతన ధర్మకర్తల మండలికి ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు హిందూ మతస్థులై ఉండాలని, ఇందులో మొత్తం ఏడుగురు ధర్మకర్తల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ధర్మకర్తల మండలిలో ఎస్సీ మహిళ ఒకరు, బీసీ మహిళ ఒకరు, ఎస్టీ మహిళ ఒకరు, ఓసీ మహిళ ఒకరు, నాయి బ్రాహ్మణ పురుషుడు అభ్యర్థి ఒకరు తప్పని సరిగా ఉంటారని ఇద్దరు ఓసీ పురుష అభ్యర్థులు ఉంటారని తెలిపారు. దరఖాస్తులు మార్చి 1వ తేదీలోపు కర్నూలు నగరంలోని మద్దూరు నగర్ అసిస్టెంట్ కమిషనర్ దేవదాయ శాఖ కార్యాలయానికి చేరుకోవాలని తెలిపారు.

పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలకు రూ.4.11 కోట్లు

జేడీ రామచంద్రయ్య

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 14: ప్యాపిలి మండలం కొమ్మెమర్రి వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. ఈమేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది జీవో.నెం.40ని విడుదల చేశారు. కళాశాల నిర్మాణం, ఇతర వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.4.11 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని పశుసంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్య తెలిపారు.

సంజీవయ్య సేవలు మరువలేం

కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: దామోదరం సంజీవయ్య రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని కలెక్టర్ డా.జి. సృజన పేర్కొన్నారు. బుధవారం సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా స్థానిక నంద్యాల చెక్ పోస్టు కూడలి వద్ద ఉన్న దామోదరం సంజీవయ్య విగ్రహానికి కలెక్టర్ డా.జి. సృజన, నగర మేయర్ బీవై రామయ్య, జిల్లా అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజానికి ఆశాజ్యోతి, స్ఫూర్తిప్రదాత అయిన దామోదరం సంజీవయ్య కర్నూలు జిల్లా, పెద్దపాడు గ్రామంలో 1921 సంవత్సరం ఫిబ్రవరి 14న జన్మించారన్నారు. నిరుపేద, దళిత కుటుంబంలో జన్మించిన ఆయన నిరాడంబరత, నిజాయితీ నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. 1960 జనవరి 10న ఆంధ్ర రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య పని చేశారని అన్నారు. ఈ సమావేశంలో సీపీవో హిమప్రభాకర్ రాజు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.



దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్

త్వరలో భారత్ రైస్

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 14: భారత్ రైస్ పేరుతో నాణ్యమైన సన్న బియ్యం సబ్సిడీపై కిలో రూ.29 కు ఇస్తామని కర్నూలు జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు తెలిపారు. పది రోజుల కింద కేంద్ర ప్రభుత్వం భారత్ రైస్ గురించి ప్రకటించడంతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నాఫెడ్ తదితర కేంద్ర సంస్థల ద్వారా సన్న బియ్యాన్ని చౌక ధరకు అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మార్క్‌ఫెడ్‌తో పాటు డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా ఈ బియ్యాన్ని అందించేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూడా చౌక ధరకు అందించేందుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం గోధుమపిండి, శనగ పప్పును అందించే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

చౌక ధరకు గోధుమ పిండి, శనగ పప్పు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ ద్వారా తక్కువ ధరకే సన్నబియ్యంతో పాటు గోధుమ పిండి, శనగ పప్పును చౌకధరకు అందించేందుకు డీసీఎంఎస్ కేంద్రాలను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా గోధుమ పిండి, శనగ పప్పులను డీసీఎంఎస్ కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు, ఆదోని బ్రాంచీల ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తున్నట్లు డీసీఎంఎస్ సంస్థ బిజినెస్ మేనేజర్ రాజేష్ తెలిపారు. శనగ పప్పు కిలో ధర రూ. 60, గోధుమ పిండి కిలో రూ.27.50 ప్రకారం పంపిణీ చేస్తున్నామన్నారు. శనగ పప్పు కిలో ప్యాకెట్, గోధుమపిండి 5 కిలోలు, 10 కిలోల ప్యాకెట్లు అందుబాటులోకి తెస్తున్నారు. ఇప్పటి వరకు కర్నూలు మార్కెట్ యార్డు డీసీఎంఎస్ కేంద్రానికి 5 టన్నుల గోధుమపిండి, 10 టన్నుల శనగ పప్పు, ఆదోని డీసీఎంఎస్ కేంద్రానికి గోధుమ పిండి 20 టన్నులు, శనగ పప్పు 10 టన్నులు కేటాయించినట్లు తెలిపారు. డోన్, కోడుమూరు డీసీఎంఎస్ కేంద్రాల్లో కూడా పై సరుకులను అందిస్తామని తెలిపారు.



చౌకధరకే అందిస్తున్న గోధుమపిండి, శనగ పప్పు ప్యాకెట్లు

రహదారి భూ సేకరణ పరిహారం చెల్లించండి

నంద్యాల కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్),ఫిబ్రవరి 14: జాతీయ రహదారులు 340సి, 340బి, 167కె లకు సంబంధించి భూ సేకరణ జరిగి అవార్డు ఎంక్వయిరీ పూర్తయిన వాటికి పరిహారం చెల్లించాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో రహదారుల భూసేకరణ, పరిహారం చెల్లింపు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి(340సి) కర్నూలు నుండి దోర్నాల వరకు, జాతీయ రహదారి (167కె) నంద్యాల నుండి జమ్మలమడుగు వరకు, జాతీయ రహదారి (340బి) సోమయాజులపల్లె నుండి డోన్ వరకు భూసేకరణ పూర్తయి పెండింగ్‌లో వున్న పరిహారాన్ని వెంటనే చెల్లించాలని కార్యనిర్వహణాధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్‌ఏ ప్రాజెక్టు డైరెక్టర్ గోవర్ధన్ రెడ్డి, ఏపీఆర్డీసీ కార్యనిర్వహణాధికారి శంకర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీధర్ రెడ్డి, ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ అధికారి సుభోద్, ఎన్‌హెచ్‌ఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, రహదారుల భూసేకరణ అధికారులు తదితరులు

శ్రీశైల పాదయాత్రికుల ఏర్పాట్లపై పరిశీలన

ఆత్మకూరు, ఫిబ్రవరి 14: శ్రీశైల మహా క్షేత్రానికి కాలినడకన వచ్చే భక్తుల సదుపాయాలపై బుధవారం దేవస్థానం అధికారులు పలు అటవీ ప్రాంతాలను పరిశీలించారు. ప్రత్యేకించి ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని నాగలూటి, పెచ్చెర్వు ప్రాంతాలను దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు మురళీధర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పీవీ సుబ్బారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీరు రంగప్రసాద్ పరిశీలించి భక్తులకు కల్పించాలని సౌకర్యాలపై చర్చించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తులు వెంకటాపురం, నాగలూటి, దామర్లకుంట, పెద్దచెరువు, మఠంబావి, భీమునికొలను, కైలాస ద్వారం మీదుగా శ్రీశైలానికి కాలినడకన చేరుకుంటారు. అయితే మార్గమధ్యలో పలు చోట్ల భక్తులకు తాగునీరు, వైద్యసేవలు, అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా అటవీ మార్గంలో జంగిల్ క్లియరెన్స్‌తోపాటు చలువ పందిళ్లు, తాగునీటి సదుపాయం, తాత్కాలిక విద్యుద్దీకరణ ఏర్పాటు చేపట్టనున్నారు. నాగలూటిలో తాగునీటిని అందించే పుష్కరిణిని శుభ్రపరచడంతోపాటు పెద్ద చెరువు, దామర్లకుంట ప్రాంతాల్లో చలువ పందిళ్లు, జనరేటర్లు, తాత్కాలిక శౌచాలయాలు ఏర్పాటు చేయనున్నారు. వీరి వెంట నాగలూటి రేంజ్ అధికారి దొరస్వామి, ఇతర అటవీ సిబ్బంది ఉన్నారు.



సదుపాయాలను పరిశీలిస్తున్న దేవస్థానం అధికారులు

మహా కుంభాభిషేకానికి ఆహ్వానం



జవహర్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న అధికారులు

శ్రీశైలం, ఫిబ్రవరి 14: శ్రీశైలం మహా క్షేత్రంలో ఈ నెల 16 నుంచి 21 వరకు మహా కుంభాభిషేక మహోత్సవం జరగనుంది. ఈ ఉత్సవానికి పలువురు ప్రముఖులను బుధవారం ఆలయ అధికారులు ఆహ్వానించారు. ఇందులో భాగంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. జవహర్‌రెడ్డి, దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్. కరికాల్ వళవన్, విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతిని మహాకుంభాభిషేక మహోత్సవానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ, ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, ఏఈవో మోహన్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ పోస్టుల మెరిట్ లిస్టు విడుదల

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 14: ఉమ్మడి జిల్లాలోని కర్నూలు, నంద్యాల, ఆదోని మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో 370 పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది నవంబరు 20న ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పోస్టులకు ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగులు 12,990 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న 26 కేటగిరీల అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టు కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేశారు. అభ్యర్థులు తమ మెరిట్‌లిస్టు వివరాలను సరి చూసుకుని అభ్యంతరాలు ఉంటే ఈ నెల 15వ తేదీ సాయంత్రం ఐదుగంటల్లోగా లిఖితపూర్వకంగా కర్నూలు మెడికల్ కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలియజేశారు. జనరల్ డ్యూటీ అటెండర్ ఆఫీసు సబార్డినేట్‌తో పాటు మరో రెండు పోస్టులకు త్వరలో ప్రొవిజినల్ మెరిట్ లిస్టును విడుదల చేస్తామని తెలిపారు.

జిల్లాకు రెండు పోలీస్ ఔట్ పోస్టులు

కర్నూలు, ఫిబ్రవరి 14: జిల్లాలో రెండు పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. జిల్లాలోని ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు వద్ద పోలీస్ ఔట్‌పోస్టు, మంత్రాలయం దేవస్థానం దగ్గర ఒక టూరిస్టు పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు వద్ద ప్రముఖుల భద్రత, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు వద్ద పోలీస్ ఔట్‌పోస్టుకు, అలాగే మంత్రాలయం దేవస్థానం వచ్చే భక్తులు, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అసౌకర్యం కలగకుండా టూరిస్టు పోలీస్ ఔట్‌పోస్టుకు అనుమతులు ఇచ్చింది. ఈ పోస్టులో భద్రత, రక్షణ పరంగా ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా తగినంత పోలీసు సిబ్బందితో 24 గంటలపాటు అందుబాటులో ఉంటారని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు తెలిపారు.

కొత్తగా 4 స్కానింగ్ కేంద్రాలకు అనుమతి

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 14: జిల్లాలో కొత్తగా 4 స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్‌కు జిల్లా మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ (పీసీపీఎన్‌డీటీ) ఆమోదం తెలిపింది. గురువారం మున్సుబ్ కోర్టు-7 అడిషినల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ న్యాయాధికారి చాంబరులో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు అధ్యక్షతన పీసీపీఎన్‌డీటీ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశానికి 7వ అడిషినల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ న్యాయాధికారి భూపాల్ రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య పాల్గొన్నారు. తనిఖీలు పూర్తి చేసి జిల్లా స్థాయి సలహా కమిటీ సిఫారసు చేసిన ఆరు రెన్యువల్స్, రెండు సవరణలకు సంబంధించిన దరఖాస్తులను కమిటీ ఆమోదించింది. ఆడపిల్లల సంరక్షణ కోసం ఎన్జీఓల సహకారంతో అవగాహన కల్పించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీఓ ప్రతినిధులు డాక్టర్ బాలమద్దయ్య, నోడల్ ఆఫీసర్ వై.ప్రవీణ్ కుమార్, డెమో ప్రమీలాదేవి, ప్రోగ్రాం కన్సల్టెంట్ సుమలత, ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శ్రీశైలంలో చిరుత సంచారం

శ్రీశైలం, ఫిబ్రవరి 14: శ్రీశైల దేవస్థానం పరిధిలోని వాసవీ విహార్-2, రెడ్ల సత్రం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చిరుత సంచరించింది. గత కొంతకాలంగా రాత్రి వేళల్లో చిరుత సంచరిస్తోందని స్థానికులు తెలిపారు. చిరుత సంచారంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అటవీ అధికారులు స్పందించి చిరుత సంచార ప్రదేశాలలో బోను ఏర్పాటు చేసి చిరుతను బంధించి ఇతర ప్రదేశానికి తరలించాలని కోరుతున్నారు.



శ్రీశైలంలో సంచరిస్తున్న చిరుత

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 14: మండలంలోని లొద్దిపల్లె గ్రామానికి చెందిన పోతురాజు దేవరాజు (44) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం దేవరాజు కర్నూలు నుంచి లొద్దిపల్లెకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన సతీష్ తన మోటారు సైకిల్‌తో అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ దేవరాజును కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని తండ్రి కర్రెన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా దేవరాజుకు టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 14 : నంద్యాల మండలం పొన్నాపురం సమీపంలోని రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు తెల్లటి షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహమ్మద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● నంద్యాల రైల్వేస్టేషన్‌లోని ప్రమాదవశాత్తు రైలు కిందపడి ఓ యువకుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్సై జలీల్ తెలిపారు. గుడ్‌షెడ్ ప్రాంతానికి చెందిన రవికుమార్ నంద్యాల రైల్వేస్టేషన్‌లోని 1వ ప్లాట్‌ఫాం నుంచి 2వ ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన రైలు ఢీ కొనడంతో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

20న జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 14: జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశభవనంలో ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఇన్‌చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డితో పాటు ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, శాసనసభ్యులు, ఎంపీలు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా అండ్ పారిశుధ్య శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి జిల్లా పరిషత్ అండ్ మండల ప్రజా పరిషత్‌ల వార్షిక బడ్జెట్‌పై చర్చ ఉంటుందన్నారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

గార్లదిన్నెలో ఘర్షణ

ప్యాపిలి, ఫిబ్రవరి 14: మండలంలోని గార్లదిన్నె గ్రామంలో బుధవారం ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. గ్రామంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ సందర్భంగా సీతారాముల ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవంలో బండి చిన్నవీరయ్య, సుబ్బారెడ్డిలు ఘర్షణ పడ్డారు. విషయాన్ని తెలుసుకున్న సుబ్బారెడ్డి బంధువులు రాజశేఖర్‌రెడ్డి, ఏకాంతరెడ్డిలు చిన్న వీరయ్యపై దాడి చేశారు. ఈ దాడిలో వీరయ్యకు గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అలాగే ఘర్షణలో రాజశేఖర్‌రెడ్డికి కూడా గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు జలదుర్గం పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మంత్రాలయం, ఫిబ్రవరి 14: మంత్రాలయం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ప్రసాద్ (44) అనే రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఐదేళ్లుగా రైతు తనకున్న రెండెకరాల పొలంలో పత్తి, మిరప ఉల్లి వంటి పంటలు సాగు చేసేవాడు. వీటిపై తెచ్చిన అప్పులు పెరగడంతో వడ్డీలు ఎక్కువై తీర్చేదారి లేక మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. ఎమ్మిగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతునికి దాదాపు రూ.8 లక్షల మేర అప్పు ఉంది. మృతుని భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మాధవరం ఏఎస్‌ఐ బందెనవాజ్ తెలిపారు. ఎమ్మిగనూరు ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి చిన్న ప్రకటన - పెద్ద స్పందన CLASSIFIEDS

LAND FOR SALE

E.తాండ్రపాడు గ్రామంలో అలంపూర్‌కు పోయే దారిలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ దగ్గరలో 62/2 సర్వే నెంబర్ గల ల్యాండ్ కన్వర్షన్ అయిన 1.3 ఎకరం గల ల్యాండ్ అమ్మకానికి కలదు. సంప్ర. 99896 42433, 94923 23013
AJL-1180097

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA-176960

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి



ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



సంజీవయ్య విగ్రహానికి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు



మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యంలో..

కర్నూలు(న్యూసిటీ) ఫిబ్రవరి 14: ఆంధ్రరాష్ట్ర మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య 103 జయంతి వేడుకలను నగరంలో ప్రభుత్వ కార్యాలయాల్లో, వివిధ ప్రజా,కుల సంఘాల అధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. డా.బీఆర్. అంబేడ్కర్ స్వచ్ఛ భారత్ రచ్చ బండ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు వి.శ్రీనివాసులు అధ్వర్యంలో బుధ వారం సమితి కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కాంగ్రెస్ కార్యా లయం దగ్గర ఉన్న దామోదరం సంజీవయ్య విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి జిల్లా కార్యదర్శి సి.గిరిధర్, కోశాధి కారి రంగస్వామి, ఉపాధ్యక్షుడు సత్యబాబు, కామేశ్వరరావు, నరసింహ రావు, రాంబాబు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

● నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఏ.భార్గవతేజ దామో దరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పివి.రామలింగేశ్వర్, ఈఈ శేష సాయి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

● సంజీవయ్య గ్రామాన్ని సమస్యల నిలయంగా మార్చవద్దని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.అంజిబాబు అన్నారు. దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని నంద్యాలచెక్‌పోస్టు సమీపంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.పెద్దబాబు, నాయకులు ఎస్.చక్రపాణి, టి.లక్ష్మీనారాయణ, నరసప్ప పాల్గొన్నారు.

● జనసేన పార్టీ ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటర్ చింతా సరేష్‌బాబు దామో దరం సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. కార్యక్రమంలో నాయకులు పీబీవి.సుబ్బయ్య, మంజునాథ్, బజారి, సుధాకర్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

● దామోదరం సంజీవయ్య 103వ జయంతిని పురస్కరించుకుని నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కేదార్‌నాథ్, రైల్వేప్ర సాద్, ప్రభుదాస్, జమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(అర్బన్): దళిత జన బాంధవుడు దామోదరం సంజీవయ్యాఅని డీసీసీ అధ్యక్షులు కే. బాబురావు అన్నారు. బుధవారం 103వ జయంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి, నంద్యాల చెక్‌పోస్టులోని దామోదరం సంజీవయ్య విగ్రహానికి నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయ కులు ఉండవెల్లి వెంటన్న, దామోదరం రాధాకృష్ణ, బీ. బ్రతుకన్న, రియాజుద్దీ న్, లాజరస్, ప్రమీలా, వెంకటరాముడు, ఏ. లలిత, గిరిధర్ పాల్గొన్నారు.

● రాయలసీమ యూనివర్సిటీలో దామోదరం సంజీవయ్య జయంతి వేడు కలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం సెనేట్ హాలులో ఎన్ఎ ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి ఉపకులపతి సుధీర్ ప్రేమ్ కుమార్, రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారె డ్డిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కర్నూలు (కల్చరల్): నీతి నిజాయితీలకు మారుపేరుగా దామోదరం సంజీవయ్య నిలిచిపోతారని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే ప్రకాశ్ కొనియాడారు. బుధవారం మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని జిల్లా గ్రంథాలయ సంస్థలో ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో డిప్యూటీ లైబ్రేరియన్ వి పెద్దక్క, ఉద్యోగులు రాజు, సువర్ణమ్మ, సుదర్శన్, నసీమాబీ, పద్మావతమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



దామోదరం సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ అధికారులు, ఉద్యోగులు



ఆర్‌యూలో దామోదరం చిత్రపటానికి నివాళులు

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 14: విద్యా సంవత్సరం పూర్తి కాక ముందే అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్న పాఠశాల యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, అధ్యక్ష కార్యదర్శులు రమణ, దామోదర్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌కు పీడీఎస్‌యూ నాయకులు వినతి పత్రం అందజేశారు. మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా పీఆర్వోలతో, క్లాస్ టీచర్లతో అక్రమంగా ఎన్నికల ప్రచారం తలపించే విధంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అడ్మిషన్లు చేస్తున్నారని ఆరోపిం చారు. గ్రాఫిక్స్ కరపత్రాలతో ఉన్నది లేనట్లుగా చిత్రీకరణ చేసి విద్యార్థి తల్లిదండ్రులను మాయమాటలతో మోసం చేస్తూ అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. అలాంటి విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, క్రిష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

కాల్వబుగ్గలో నీటి సమస్యను పరిష్కరించండి



కాల్వబుగ్గలో కోనేటిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 14: కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో ఉన్న నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ కోరారు. బుధ వారం మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో శివునికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం వర్షా భావ పరిస్థితుల వల్ల ఎండిపోయిన కోనేర్లను, వాగును పరిశీలించారు. వారు మాట్లాడుతూ మార్చిలో మహాశివరాత్రి పండుగ ఉన్నందున బోర్లు వేసి వాటి ద్వారా కోనేర్లకు నీరు నింపి భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గత టీడీపీ హయాంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా బోర్లు వేసి నీటిని నింపి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటి వసతి కల్పించామన్నారు. అధికారులు స్పందించి బోర్లు వేసి కోనేటిని నింపి భక్తులకు తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కాల్వబుగ్గ మాజీ చైర్మన్ సుధాకర్, నాయకులు వేణు, జయక్రిష్ణ, కాటినేని నారాయణ, రామగోవిందు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 14: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమ స్యల పరిష్కారానికి రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు బుధవారం ఓర్వకల్లులో ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం తహసీల్దార్ నటరాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఏపీటీ ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్ మాట్లాడుతూ జగన్ ఇచ్చిన హామీల ప్రకారం తక్షణమే సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఓపీఎస్‌ను అమలు చేయాలని 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని, జీతాలు, పెన్షన్లు ప్రతి నెలా 1వ తేదీనే చెల్లించాలని పెండింగ్‌లో ఉన్న బకాయి లన్నీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నరేంద్ర, మహబూబ్ బాషా, జయశ్రీ, డిప్యూటీ తహ సీల్దార్ సతీష్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరానికి ప్రభుత్వ సలహాదారుడు రాక

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 14: పంచాయితీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖకు సంబంధించి ప్రభుత్వ సలహాదారుడు పోతిరెడ్డి నాగా ర్జున రెడ్డి గురువారం నగరానికి రానున్నట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి తెలి పారు. ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు కర్నూలు అసెంబ్లీ నియో జకవర్గ పరిధిలోని సచివాలయాల తనిఖీ, మధ్యాహ్నం 2 గంటలకు జగనన్న కాలనీల పర్యటన, 3 గంటలకు సెర్ప్ సమావేశం, సాయంత్రం 4 గంటలకు స్థానిక ఎమ్మెల్యేలు, సచివాలయ ఉద్యోగులు, సర్పంచులు, ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీలు, మార్కెట్ యార్డు చైర్మన్లతో సమావేశం ఉంటుందన్నారు.

అక్రిడిటేషన్ జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీయుడబ్ల్యూజేఎఫ్ నాయకులు

కర్నూలు, ఫిబ్రవరి 14: అక్రిడిటేషన్ ఉన్న ప్రతి జర్న లిస్టుకు జర్నలిస్టు హౌసింగ్ స్కీం కింద 3 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని ఏపీడబ్ల్యూజే ఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. అనంతరం కలె క్టర్ డా.జి.సృజనను కలిసి వినతి పత్రం అందజేశారు. వంశపారంపర్యంగా ఉన్న భూములు, భార్య పేరున ఇంటి పట్టా ఉందని 92 మంది పాత్రికేయుల దరఖాస్తులను తిరస్కరించారన్నారు. అందరికీ ఇంటి స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నజీర్‌బాషా, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పెద్దాసుపత్రికి పరికరాలు విరాళం



వైద్యపరికరాలను సూపరింటెండెంట్‌కు అందిస్తున్న రఘునాథరెడ్డి

కర్నూలు (హాస్పిటల్), ఫిబ్రవరి 14: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు నగరంలోని ఎన్ఆర్‌పేటలో నున్న రేణుక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య పరికరా లను విరాళంగా అందిం చింది. రేణుక మల్టి స్పెషా లిటీ హాస్పిటల్ అధినేత ఆర్థో సర్జన్ జే.రఘునాథ్ రెడ్డి ఐదు డైమండ్ బీపీ ఆపరేటర్లు, వెంకి కంపెనీకి చెందిన రెండు సక్సెస్ ఆపరేటర్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.వెంకట రంగారెడ్డికి అందించారు. కార్పొరేట్ హాస్పిటల్స్, ప్రైవేటు హాస్పిటల్స్ పేద రోగులు వస్తున్న కర్నూలు జీజీహెచ్‌కు వైద్య పరికరాలు విరాళంగా ఇవ్వడం అభినందనీయమన్నారు.

నేడు రామిరెడ్డితాత తిరుణాల

కోడుమూరు (రూరల్), ఫిబ్రవరి 14: మండలంలోని అనుగొండ గ్రామంలో వెలసిన రామిరెడ్డి తాతార్యుల వార్షిక తిరుణాల వేడుకలు గురు వారం నిర్వహిస్తున్నట్లు గ్రామప్రజలు తెలిపారు. బుధవారం రాత్రి తాత కాంస్యవిగ్రహాన్ని లద్దగిరి రామదాసుస్వామి ఆలయం చేర్చి అక్కడ పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం పంచామృతాభిషేకం, తాతార్యులనామ జపం, పల్లకి ఊరేగింపు జరిపించనున్నారు. శుక్రవారం ఎద్దుల బండలాగు పోటీలు నిర్వహించి విజేత ఎద్దుల యజమానులకు దాతల సాయంతో నగదు బహుమతి అందజేయనున్నట్లు వివరించారు.

PUBLIC NOTICE

The General Public/Financial Institutions/ Banks/ NBFIs are hereby informed by M/s. Andhra Pradesh State Financial Corporation, Kadapa Branch that, **Sri Peram Shyam Sunder Reddy S/o Peram Narayana Reddy**, resident of D.No.7/336-A5, Bhagyanagar Colony, Kadapa, YSR District, has agreed to offer the freehold interest in Collateral Security Properties by way of Regd. Memorandum of deposit of title deeds in favor of Andhra Pradesh State Financial Corporation, Kadapa Branch against the Working Capital Term loan of **Rs.40.00 Lakhs** sanctioned to **M/S SRI VENKATESWARA BIO CRUDES**, a proprietary Concern represented by its Propx: **Smt. P. Vijaya Kumari** w/o P. Shyam Sunder Reddy, resident of D.No.7/336-A5, Bhagyanagar Colony, Kadapa, YSR District and unit situated at Plot No.95, Industrial Development Area, Kadapa, YSR District under Marketing Assistance Scheme to meet the gap in working capital requirements of the retail outlet engaged in trading of Pyrolysis Oil.

The absolute owner of Collateral Security Holder cum Surety is entitled to the schedule property by virtue of **Regd. Rectification deed dt:13.02.2024, Doc No.9821/2024, Regd. Sale deed dt:17.11.2023, Doc No.15017/2023**, and Link Documents, which were registered in the Office of Sub-Registrar Kurnool, Kurnool District. Except these documents, he is not having any other documents for the scheduled Collateral Security Property and he is the absolute and sole owner of the below mentioned collateral Security property. Hence, anyone having any Claim, interest, right, or known or unknown priorities, charges over the schedule property or anyone having any objection for this proposed mortgage may kindly intimate the undersigned in writing with supportive documents within Seven Days from the date of publication of this notice. Else, it will be deemed that, there are no objections and this property will be construed as having clear, valid, marketable and absolute title and will be taken for mortgage and subsequent objections, Claims if any will not be entertained/ binding to us. SCHEDULE OF COLLATERAL SECURITEY PROPERTEY Freehold interest in all that piece and parcel of Residential Flat No: 201, Second Floor with plinth area of 1350sft, consisting of Undivided & Unspecified Share of land admeasuring (1/16th) i.e 56.25 Sq. Yards out of total land extent of 900 Sq.yards in LP No: 19/1994, bearing D.No: 40/321-E-201, Assessment No: 1016024167 Covered by Sy.No: 99/2-B-2 & 102/1, situated at Near Ayyappa Swamy Temple, Ward No: 40, Kondaveedu Appartment, Bhasker Nagar, Kurnool Municipal Corporation, Kurnool Town and SRO, Kurnool District bounded by Boundaries of Land: **East**:33 feet wide Road, **West**: Owners land of Block-C-3/A, **North**: Municipal Open Site, **South**: Imran Ali Khan & Rehan's Ali Khan site of block C-1. Boundaries of Flat: **East** : Open to Sky, **West** : Staircase, **North**: Open to Sky, **South**: Flat No.202 & Corridor, together with buildings constructed / to be constructed there on with all easement rights.

Date :14.02.2024.

BRANCH MANAGER,
A.P.STATE FINANCIAL CORPORATION,
KADAPA BRANCH, Phone: 08562-295765

రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు సీఎం కావాలి

● మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, ఫిబ్రవరి 14: రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ అధినేత చంద్ర బాబే ముఖ్యమంత్రి కావాలని పాణ్యం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పేర్కొ న్నారు. మండలంలోని హుశేనాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ మినీ మేనిఫె స్టోలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటికి ప్రచారం నిర్వహిం చారు. వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. ఎన్నికలకు తాము సిద్ధమని జగన్ రెడ్డి, వైసీపీ నేతలు చెబుతుంటే.. మరో వైపు ప్రజలు కూడా మిమ్మల్ని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఓర్వ కల్లు మండలంలో టీడీపీ హయాంలో విమానాశ్రయం, ఉక్కు పరిశ్రమ, డీఆర్‌డీవో, సోలార్ పరిశ్రమలు స్థాపించడం జరిగిందన్నారు. అనంతరం ఐదు సంవత్సరాల క్రితం పుల్వామా దాడిలో వీరమరణం పొందిన వీరు లకు కొవ్వొతులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ముస్లీం మైనార్టీ నాయకుడు మహబూబ్ బాషా, షమీవుల్లా, అన్వర్, ఉప సర్పంచ్ షమీనా, నాయకులు సుధాకర్, రామగో విందు, బజారు, వేణు, జయకృష్ణ, సంజీవ, కేవీ మధు పాల్గొన్నారు.



హుశేనాపురంలో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న గౌరు చరిత, మల్లెల రాజశేఖర్

ఉలిందకొండలో పెద్దమ్మ దేవర

కల్లూరు, ఫిబ్రవరి 14: ఉలిందకొండ గ్రామంలో పెద్దమ్మ, సుంకులమ్మ, మారెమ్మ, కర్రెమ్మ అమ్మవార్ల దేవర మహోత్సవాలను గ్రామకమిటీ పెద్దల ఆధ్వర్యంలో కన్నుల పండువగా నిర్వహించారు. బుధవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం గ్రామ దేవతలకు ప్రజలు మొక్కులు సమర్పిం చుకున్నారు. పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, ఎమ్మిగనూరు టీడీపీ ఇన్‌చార్జి బివి.జయనాగే శ్వరరెడ్డి అమ్మవారి దేవర వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈవీ రమణ, కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మ ణపల్లె నాగిరెడ్డి, జె.గంగాధర్‌గౌడ్. కాసాని మహేష్‌గౌడ్, ఈవీ శ్రీకాంత్, రంగస్వామిరెడ్డి, దస్తగిరి నాయుడు, సుబ్బరాయుడు, కరీం పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

● డీఆర్వో మధుసూదన్‌రావు



కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: 18 సంవ త్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నమోదు చేయించాలని జిల్లా రెవెన్యూ అధికారి కే మధుసూదన్‌రావు రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో తుది ఓటర్ల జాబితా ప్రచురణ, పోలింగ్ స్టేషన్‌లలో మౌలిక వసతులు సంబంధించి రాజ కీయ పార్టీ ప్రతినిధులతో డీఆర్వో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, మొబైల్ టాయిలెట్స్, దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 80 సంవత్సరాలు నిండి నడవలేని వృద్ధులకు ఫారం-12డి ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఇంటి వద్ద నుంచి వారు ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ అవ కాశం కల్పించిందన్నారు. ఏవైనా సమస్య లు ఉంటే జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో బీజేపీ ప్రతినిధి సాయిప్రదీప్, టీడీపీ ప్రతినిధి ఎల్వీ ప్రసాద్, వైసీపీ ప్రతినిధి కె.వుల్లారెడ్డి, సీపీఐ, ఇండియన్ కాంగ్రెస్ ప్రతినిధులు ఎన్నికల విభాగాల సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో జాతీయ స్థాయి పతకాలు

● అభినందించిన టీజీ వెంకటేష్



కరాటేలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 14: విశాఖపట్నం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధిం చారని కరాటే మాస్టర్ టి.శ్రీని వాసులు తెలిపారు. బుధవా రం మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ స్వగృహంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారు లకు అభినందనలు తెలిపారు. అనంతరం గోల్డ్‌మెడల్ సాధించిన వినయ్, రిషి, మహేందర్, ఆయుష్, ప్రశాం త్, బాలాజి, అలాగే సిల్వర్ మెడల్స్ సాధించిన సాయి అరవింద్, తేజేంద్ర, బ్రౌంజ్ మెడల్స్ జయరాం, తేజ, కేదార్నాథ్, క్రాంతి సాధించారని, వీరికి టీజీ వెంకటేశ్ సర్టిఫికేట్లను, గోల్డ్‌మెడల్స్‌ను మాస్టర్ టి.శ్రీనివాసులు సమక్షంలో అందజేశారు.

జేఈఈ-మెయిన్స్‌లో టౌన్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



జేఈఈ-మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుంకన్న, అధ్యాపకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 14: జేఈఈ-మెయిన్స్ ఫేజ్-1 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కర్నూలు టౌన్‌మోడల్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ సి.సుంకన్న బుధవారం తెలిపారు. విద్యా ర్థులు పి.మౌలాలి, అరవిందు, సూర్యప్రకాష్ నాయక్, కేఎస్ఎస్ హర్షవర్ధన్, ఎం.ఉష, కె.మహేష్ జేఈఈ-మెయిన్స్ పరీక్షల్లో అత్యధిక పర్సంటైల్‌ను సాధించి నట్లు ఆయన తెలిపారు.

కూలీల హాజరు పెంచండి: ఏపీడీ

కోడుమూరు (రూరల్), ఫిబ్రవరి 14: ఉపాధి హామీ పనులకు కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ పక్కీరప్ప సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఏపీడీ, ఏపీవో మోదీన్‌సాహె బ్ పలు అంశాలపై మాట్లాడుతూ అడిగిన వారందరికీ పనులు కల్పించడంపై అవగాహన కల్పించాలన్నారు. పండ్ల తోటల పెంపకానికి రైతులను గుర్తించా లని చెప్పారు. కూలీల ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. మేకలు, గొర్రెలు, పశువుల షెడ్ల యూనిట్లు లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశిం చారు. కార్యక్రమంలో ఈసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


వైభవంగా హనుమంతరాయుని ఆలయ వార్షికోత్సవం



పాణ్యం ఎమ్మెల్యే కాటసానిని సన్మానిస్తున్న దామోదర ఆయిల్‌మిల్ అధినేత మహేశ్వరరెడ్డి

కల్లూరు, ఫిబ్రవరి 14: కల్లూరులో వెలసిన గోడల హనుమంతరా యుని ఆలయ ద్వితీయ వార్షికోత్సవం దామోదర ఆయిల్ మిల్ అధినేత ఎస్.మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. బుధవారం స్వామివారి ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై గణపతిపూజ, పుణ్యాహవాచనం, దీక్షాదారణలతో పూజల్లో పాల్గొన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయిల్‌మిల్ అధినేత ఎస్.మహేశ్వరరెడ్డి, ఎస్.రాజేష్‌రెడ్డి దంపతులు స్వాగతం పలికారు. అనం తరం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని, బీజేపీ నాయకురాలు బైరెడ్డి శబరి, సుబ్బారెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, రంగప్ప, సేరేష్‌రెడ్డి, సర్వేశ్వరరెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో 'వసంత పంచమి' వేడుకలు



వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాస కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 14: నగరంలోని హరిహర క్షేత్రంలో శ్రీదేవీ భూదేవీ సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామివార్ల 18వ బ్రహ్మోత్సవాలు నిత్యం వైభవంగా కొనసాగుతుండగా, ఆయిదోరోజు బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకములు నిర్వహిం చారు. అలాగే వసంత పంచమి వేడుకను పురస్కరించుకొని ఆలయంలో సర స్వతి దేవి అమ్మవారి ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యా ర్థినీ విద్యార్థులచేత సరస్వతి దేవి పూజలు చేసి వారికి అమ్మవారి కంకణాలు, పలుకలు, బలపాలు, నోటు పుస్తకాలు, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం ఆలయం ఆవరణలో సరస్వతి దేవి అమ్మవారికి హోమం నిర్వ హించారు. కార్యక్రమాల్లో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోట్ల చంద్రశేఖరశర్మ, హెచ్‌ఏ రాజశేఖర్‌రావు, గౌరవ సలహాదారు హెచ్‌కే మనోహ ర్‌రావు, సభ్యులు కేజీ ప్రభాకర్, శివరాంప్రసాద్, రామమనోహర్, సోమనాథ మూర్తి, ఉమేష్, వాయుసేన సేవాదళ్, మహిళా సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.


'అమర వీరుల త్యాగాలను స్మరించుకుందాం'



పుల్వామా అమర వీరులకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పిస్తున్న నగరూరు రాఘవేంద్ర, బీజేపీ నాయకులు

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 14: అమర వీరుల త్యాగాలను స్మరిం చుకుందామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. బుధవారం రాత్రి నగరంలోని 46వ వార్డు రైల్వేస్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, పుల్వామా ఉగ్రవాద దాడిలో మృతి చెందిన 40 మంది వీర జవానుల చిత్రపటం ముందు కొవ్వొత్తులు వెలిగించి నివా ళులు అర్పించారు. అమరవీరుల త్యాగ నిరతిని శ్లాఘిస్తూ జోహర్లు అర్పిం చారు. అనంతరం రాఘవేంద్ర మాట్లాడుతూ ఫిబ్రవరి 14 భారతీయులకు బ్లాక్‌డే గా నిలిచిపోతుందని, దేశ చరిత్రలోనే ఇది అతిపెద్ద ఉగ్రదాడి అని అన్నారు. దేశ రక్షణకు అమరులైన జవానుల త్యాగాలు వృథా కాకూడదని, ఏటా వారిని స్మరించుకుంటూ వారి ఆశయాలకు అనుగుణంగా దేశాభివృ ద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రామాంజినేయులు, జిల్లా కోశాధికారి లోకేశ్వరయ్య, బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఖాన్, నాయకులు భూపాల్‌శర్మ, శివయ్యశెట్టి, పర్ల శివ, గోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్



ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 14: ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశా ల ప్రిన్సిపాల్ జి. హేమంత్‌కు డాక్టర్ రేట్ ప్రదానం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఫోరస్ మాధ్యమం ద్వారా అస్థిర మాగ్నిటో డైమిక్ ఉష్ణ ప్రసరణ ప్రవాహాల ఉష్ణ బదిలీ విశ్లే షణ అనే అంశంపై పరిశోధనలు జరిపినందుకు ఈ డాక్టరేట్ వరిం చింది. పరిశోధన పర్యవేక్షకుడు ప్రొఫెసర్ ఎన్ కిషన్ కళాశాల ఆధ్యాపక, ఆధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.


అభయాంజనేయ స్వామి ఆలయ పునరుద్ధరణ

కర్నూలు(ఎడ్యుకేషన్),ఫిబ్రవరి 14: స్థానిక లక్ష్మీపురంలోని జగన్నాథగట్టుకు వెళ్లే దారిలో రిడ్జ్ స్కూల్ రైల్వేగేటు వద్ద ఉన్న అభ యాంజనేయస్వామి ఆలయ పునఃప్రతిష్ట వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమాన్ని రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య ఆధ్వ ర్యంలో చేపట్టారు. విగ్రహ ప్రతిష్ట, కలశ ప్రతిష్ట, ధ్వజస్తంబ ప్రతిష్ట కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్ర మంలో కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, ఆయన సతీ మణి కర్నూలు కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎస్వీ విజయమ నోహరి, కేవీ సుబ్బారెడ్డి విద్యాసం స్థల అధినేత డా.కేవీ సుబ్బారెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బగి రథరెడ్డి భక్తులు పాల్గొన్నారు.



అభయాంజనేయ ఆలయం

ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 14: నగర శివారు, మామిదాలపాడులో వెలసిన గోదా రంగనా థస్వామి దేవాలయం (గోకులం)లో నిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ అభినందనీయమని మాజీ మంత్రి, టీడీపీ నేత కేఈ ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆయన గోకులాన్ని సందర్శించి, స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. గోకులం ప్రథమ వార్షిక బ్రహ్మో త్సవాల కరపత్రాన్ని గోకులం ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. గోదా రంగనాథ రామానుజ కూటమి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, గోకులం కమిటీ ఇతర ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు న్యాయం చేయాలి

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: విభిన్న ప్రతిభావంతులకు న్యాయం చేయాలని తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యా లయం ముందు రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను విభిన్న ప్రతిభావంతులు దహనం చేశారు. విభిన్న ప్రతిభావంతులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మద్దిలేటి, సురేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దేవతమూర్తులకు ప్రాణ ప్రతిష్ఠాపన


మాట్లాడుతున్న కల్లుమఠం పీఠాధిపతి

ఆదోని టౌన్, ఫిబ్రవరి 14: పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ వెనుక ఉన్న వందేళ్ల నాటి అశ్వత్థ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో బుధవారం మహాగణపతి, ఏకముఖి, పంచముఖి నాగదేవతల సతీసమేత నవగ్రహ విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శంకరానంద సరస్వతి మహాప్రస్థానం శారద దత్తపీఠం పీఠాధిపతి సుబ్రహ్మణ్య మహాస్వామి (మైసూర్ స్వామి) ఆధ్వర్యంలో, మండిగిరిలోని కల్లుమఠం పీఠాధిపతి శ్రీమాన్ నిరంజన్ గురుసిద్ధ దేవరు సాన్నిహిత్యంలో హోమం, విశిష్ఠ పూజలు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి మాట్లాడుతూ కొత్త దేవాలయాల ఏర్పాటు కన్నా ముందు పురాతన చారిత్రాత్మకమైన దేవాలయాలకు జీర్ణోద్ధరణ కల్పించడానికి ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. యంత్ర ప్రతిష్ఠ, విగ్రహాల ప్రతిష్ఠాపన, శిఖర కలశ ప్రతిష్ఠ, బలిపూర్ణాహుతి, మహా మంగళహారతి కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకొన్నారని ఆలయ నిర్వాహక అధ్యక్షుడు నాగరాజు గౌడ్, గౌరవ అధ్యక్షుడు విట్టా సురేంద్ర బాబు తెలిపారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, బుద్దారెడ్డి, చెన్నబసప్ప, విట్టా సతీష్, విశ్వనాథ్, శివ, సత్య, సురేష్, ఎమ్మెల్యే కుమారుడు మనోజ్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న వెంకటేశులు

ఆదోని రూరల్, ఫిబ్రవరి14 : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబులు కోరారు. బుధవారం ఐఎఫ్‌టీయూ నాయకులు వెంకప్ప ఆధ్వర్యంలో రెవెన్యూ భవన్‌లో వివిధ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాలు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా శుక్రవారం జరిగే భారత్ బంద్‌లో పెద్ద ఎత్తున కార్మికులు, కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు.

ఎమ్మిగనూరులో బైక్ ర్యాలీ

ఎమ్మిగనూరు రూరల్ : బీజేపీ, వైసీపీ ప్రభుత్వాల విధానాలను నిరసిస్తూ చేపట్టే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు పంపన్నగౌడు, గోవిందు, ప్రసాద్, హనుమంతులు పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తిమ్మగురుడు, రాముడు, రాజీవ్, శాంతప్ప, వీరేష్, అబ్దుల్లా లు పాల్గొన్నారు.

'బీసీవైతోనే బీసీల అభివృద్ధి'

తుగ్గలి, ఫిబ్రవరి 14: బడుగు, బలహీనవర్గాలు అభివృద్ధి చెందాలంటే బీసీవై పార్టీతోనే సాధ్యమని భారత చైతన్య యువజన పార్టీ పత్తికొండ ఇన్‌చార్జి జొన్నగిరి మిద్దె వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాంపల్లెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలు అభివృద్ధి చెందాలంటే.. ప్రతి నియోజకవర్గంలో బీసీలకే ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అధికార వైసీపీ పార్టీ బీసీలను అణచివేస్తోందని, వచ్చే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల నుంచి బీసీవై పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని తెలిపారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయల విహారం

మంత్రాలయం, ఫిబ్రవరి 14: ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణరథంపై ఊరేగారు. బుధవారం రాత్రి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆశిస్సులతో మఠం దివాన్ శ్రీనాథాచార్ ఆధ్వర్యంలో రథోత్సవం వైభవంగా సాగింది. వజ్రాలతో పొదిగిన స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విద్యుత్ కాంతుల మధ్య స్వామివారు ఊరేగుతున్న దృశ్యం భక్తులను ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు ఊంజల సేవలో పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో రైల్వే ఉన్నతాధికారులు


శ్రీమఠంలో ప్రదిక్షణలు చేస్తున్న రైల్వే ఉన్నతాధికారులు

మంత్రాలయం, ఫిబ్రవరి 14: మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం సికింద్రాబాదు రైల్వే డీసీఎం కేఆర్‌పి రెడ్డి, గుంతకల్లు డీఆర్‌ఎం సోమశేఖర్ నాయుడు బుధవారం రాత్రి మంత్రాలయం వచ్చారు. వీరికి అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, బిందుమాధవ్, వ్యాసరాజాచార్ ఘనంగా స్వాగతం పలికారు. సింగిల్ విండో అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి, రైల్వే అధికారులతో కలిసి గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. మఠం పండితులు రాఘవేంద్రస్వామి జ్ఞాపికను అందజేసి ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, వీరశేఖర్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, బాషా, అమీన్, బోయ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐలు

మంత్రాలయం, ఫిబ్రవరి 14: మంత్రాలయం, మాధవరం నూతన ఎస్ఐలుగా గోపినాథ్, క్రిష్ణమూర్తి బుధవారం బాధ్యతలు చేపట్టారు. మంత్రాలయంలో పని చేస్తున్న కర్నూలు స్పెషల్ బ్రాంచికు, మాధవరంలో పని చేస్తున్న కిరణ్‌బాబు అవుకు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. మాధవరం ఎస్ఐగా ఆత్మకూరు నుంచి మాధవరానికి, మంత్రాలయం ఎస్ఐగా కర్నూలు టూటౌన్ నుంచి గోపినాథ్ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికలు సామరస్యంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు.

విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోవాలి

పెద్దకడుబూరు, ఫిబ్రవరి 14: పెద్దకడుబూరు విద్యుత్ ఏఈ సబ్బయ్యపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బస్టాండ్ దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వీరేష్, అంజినయ్య మాట్లాడుతూ విద్యుత్ సరఫరాపై ఏఈ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై విచారణ జరిపి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిక్కన, హనుమంతు పాల్గొన్నారు.

రహదారికి అడ్డుగా గోడ కట్టారంటూ ఘర్షణ

గోనెగండ్ల, ఫిబ్రవరి 14: పెద్దనేలటూరు గ్రామంలోని వీధిలో ఓ ఇంటికి వెళ్లే రహదారికి అడ్డంగా గోడ కట్టడంతో ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురి పై కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణయ్య తెలిపారు. గ్రామంలోని ఎలిషమ్మ ఇంటికి వెళ్లే దారిలో అడ్డంగా కొందరు గోడ కట్టారు. రాహదారికి అడ్డంగా గోడ ఎందుకు కట్టారని ఎలిషమ్మ తిరుమలమ్మ తోపాటు మరో ఇద్దరితో గొడవ పడ్డారు. దీంతో ఎలిషమ్మ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తిరుమలమ్మ లతో పాటు మరో ఇద్దరి పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగ జేఏసీ నిరసనలు

● జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక నాయకుల ఆందోళనలు

'నాలుగున్నరేళ్లుగా ఉద్యోగుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదు. ఒకటో తేదీన జీతాలు తీసుకోలేని పరిస్థితిలో ఉన్నాం. ఇక ఈ ప్రభుత్వాన్ని భరించలేం. గద్దె దింపాలని ఐక్యంగా కృతనిశ్చయంతో ఉన్నాం.. సమస్యలు పరిష్కరించకపోతే సీఎం జగన్‌రెడ్డి రోజులు లెక్కపెట్టుకోవాల్సిందే. తక్షణమే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ పీఆర్సీలోని మధ్యంతర భృతి 30 శాతం చెల్లించాలని' డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.


ఆదోనిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగ జేఏసీ నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 14: ఏపీజేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో ప్రధాన కార్యదర్శి మల్లికార్జున రెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యాసీన్ బాషా మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఒకటో తేదీన జీతాలు తీసుకోలేని పరిస్థితిలో ఉద్యోగులమున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెండిగ్‌లో ఉన్న డీఏలను, సీపీఎస్ వారికి డీఏ అరియర్స్ 90 శాతం నగదుగా చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఏపీఎన్జీవో ఉపాధ్యక్షురాలు ఉషారాణి, వెంకటేశ్వర్లు, సునీత, దీప, ఆర్టీసీ కార్మికులు హరిబాబు, లక్ష్మన్న పాల్గొన్నారు

ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

ఆలూరు : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాల సమస్య పరిష్కారంలో ప్రభుత్వం జాప్యం తగదని ఏపీజేఏసీ ఆలూరు తాలూకా చైర్మన్ మోహన్, ఎన్జీవో కార్యదర్శి బాలకృష్ణ ఆరోపించారు. బుధవారం జేఏసీ పిలుపు మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఖాసీం, రమేష్, చిన్న ఉలిగప్ప, శేఖర్, గుండాల నాయక్, రవి, ఆనంద్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఏపీజేఏసీ జిల్లా కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వరప్రసాద్, శివరామిరెడ్డి, సురేష్, రామకృష్ణ, నరసింహులు, నరేష్, సరస్వతి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కరెకృష్ణ, యల్లప్ప, కాశింజి, మదర్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

పత్తికొండ : పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులసమస్యలు పరిష్కరించాలంటూ ఉద్యోగ జేఏసీ నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. స్థానిక నాలుగు స్తంభాల కూడలి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలంలో వినతిపత్రాన్ని అందించారు. నాయకులు సాయిబాబా, టీఎండి హుసేన్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

● ఎరిగేరి జనసేన కార్యక్రమంలో తిక్కారెడ్డి


ఎరిగేరిలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కౌతాళం, ఫిబ్రవరి 14: మరో రెండు నెలల్లో టీడీపీ, జనసేన కూటమి అధికారం చేపట్టడం తథ్యమని, వైసీపీ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్దామని తెలుగుదేశం పార్టీ మంత్రాలయం ఇన్‌చార్జి తిక్కారెడ్డి, జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న అన్నారు. మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో జనసేన మండల నాయకుడు రామాంజనేయులు, ఆదాము ఆధ్వర్యంలో జనసేన పార్టీ జెండావిష్కరణ చేపట్టారు. కార్యక్రమానికి తిక్కారెడ్డి, లక్ష్మన్న హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మూడు సార్లు గెలిచి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని, దోచుకోవడమే ధ్యేయంగా ఇసుక, మద్యం, మట్కా దందాలు విచ్చలవిడిగా సాగిస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో ఎక్కడైనా నీరు ఇచ్చారా.. రోడ్లు వేయించారా అని ప్రశ్నించారు. గ్రామంలో పేదల నుంచి వైసీపీ నాయకులు ఇళ్ల పట్టాల కోసం డబ్బు వసులు చేసి పాత పట్టాలు అందించారని, తాను ఎమ్మెల్యేగా గెలిచి నిజమైన పేదలకు ఇళ్ల పట్టాలతో పాటు ఇళ్లను నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆడివప్పగౌడ్, వెంకటపతిరాజు, కోట్రేష్‌గౌడ్, టిప్పు సుల్తాన్, రాజానందు, సిద్దు, ఐటీడీపీ సభ్యులు మంజునాథ, వీరేష్, దశరథరామిరెడ్డి, జనసేనా నాయకులు రామాంజనేయులు, ఆదాము, ఈరన్న, మహమ్మద్‌లు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించండి


కేశ శ్యాంబాబును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, జనవరి 14: రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించి నారా చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని టీడీపీ తాలూకా ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచు పార్వతమ్మ, శివప్ప స్వగృహానికి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు శాలువతో కేఈని సన్మానించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన అరాచకాలు, దాడులు, దోపిడీలు, అక్రమాలు, కక్ష సాధింపు చర్యల గురించి కార్యకర్తలు ప్రజలకు వివరించాలని సూచించారు. తిరిగి వైసీపీకి అవకాశం ఇస్తే.. రాష్ట్రం సర్వనాశనం అవుతుందన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు పి.పురుషోత్తం చౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, ఎన్.లక్ష్మినారాయణ, ఈడిగ చంద్రశేఖర్‌గౌడు, ఆవుల పెద్దన్న, నర్రా సుధాకర్, రమేష్, సోషల్ మీడియా కన్వీనర్ హుశేన్‌పీరా ఉన్నారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి


దామోదరం సంజీవయ్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 14: ఉమ్మడి రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 103వ జయంతిని సంజీవయ్య కాలనీలో దళిత సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీ సీఎం సంజీవయ్య విగ్రహానికి మహానాడు రాష్ట్ర నాయకుడు సీఆర్‌స్వామి, తలారి ఆంజనేయులు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ మాజీ సభ్యుడు దేవిప్రసాద్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య తన పాలనలో ఎన్నిక సంస్కరణలు తెచ్చారని, బహుజనుల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసిన మహనీయుడని కొనియాడారు మానిటరింగ్ కమిటీ సభ్యుడు రవికుమార్, సాయిరాం, ఎల్లప్ప, కేశవ్, బాలాజీ, లక్ష్మణ, బొబ్బిలి, నకుల, రాజు, నరేష్ పాల్గొన్నారు.

నిజాయితీకి మారు పేరు సంజీవయ్య

ఆదోని రూరల్ : దళిత ముద్దు బిడ్డ దివంగత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య నీతి నిజాయితీకి మారు పేరని మాలమహానాడు నాయకులు బాలాజీ, లక్ష్మన్న, కేశవ మాస్టర్, ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ సభ్యులు ఎరుకల రవి కుమార్ అన్నారు. దామోదరం సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన సంజీవయ్య ఎన్నో సంస్కరణలకు నాంది పలికి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. దేవిశెట్టి ప్రకాష్, తలారి ఆంజనేయులు, వీరేష్, రవి, నరేష్, ప్రతాప్, శీను, తదితరులు పాల్గొన్నారు.

ఆయన పాలన దేశానికి ఆదర్శం

ఆలూరు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదర్ సంజీవయ్య సేవలు దేశానికి ఆదర్శమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది అన్నారు. ఆలూరులోని స్థానిక వాసవి కల్యాణ మండపంలో మాల మహానాడు ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. లక్ష్మీనారాయణ, వెంకట్ రాముడు, భరత్, ఈరన్న, మల్లికార్జున పాల్గొన్నారు.

సంజీవయ్యకు ఘన నివాళి

ఎమ్మిగనూరు టౌన్ : పట్టణంలోని సంజీవయ్య నగర్‌లో మాల మహానాడు పట్టణ అధ్యక్షుడు ఎద్దుల చెన్నయ్య అధ్యక్షతన దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. నాయకులు మాల నరసన్న, ప్రజా సంఘాల నాయకులు రాజు, యేసేపు, అనీఫ్, హనుమంతు, ఆంజనేయులు, పరశురాం, మల్లి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆలూరు, ఫిబ్రవరి 14: మండలంలోని కురుకుంద గ్రామానికి చెందిన దిడ్డి పంపన్న (65) బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన భార్య, బంధువులు వెంటనే ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స నిర్వహించారు. బంధువుల వివరాల మేరకు.. ఆలూరులో టీడీపీ టికెట్ సుజాతమ్మకు రావడం కష్టమని వస్తున్న వదంతులు నమ్మి పంపయ్య తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఆసుపత్రికి చేరుకొని పంపన్నను పరామర్శించారు.

'బిల్లేకల్లు హెచ్ఎంను సస్పెండ్ చేయాలి'

ఆస్పరి, ఫిబ్రవరి 14: మండలంలోని బిల్లేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయరాలుగా పనిచేస్తున్న పరిమళను సస్పెండ్ చేయాలని విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం ఎస్ఎఫ్ఐ, టీఎన్ఎస్ఎఫ్ మండల కార్యదర్శిలు మసాలా రవి, రమేష్, తలారి సిద్దు, లక్ష్మన్న మాట్లాడుతూ బిల్లేకల్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులకు తాగేందుకు నీరు లేదన్నారు. పిల్లల చేత పనులు చేయిస్తూ బాలకార్మిక చట్టానికి వ్యతిరేకంగా ఆమె పనిచేస్తున్నాని, అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ముందస్తు అరెస్టు

- సీఎంకు విద్యార్థి, యువజన సంఘాలంటే ఎందుకు భయం
- ఇంత భయపడుతూ పాలన ఎలా సాగిస్తున్నారు
- ప్రభుత్వ, పోలీసు చర్య పై నాయకుల ఆగ్రహం
- పోలీసుల అదుపులో విద్యార్థి సంఘాల నాయకులు


పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఉన్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు , ఫిబ్రవరి 14: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌గురువారం కర్నూలులో జరుగుతున్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మనవడి వివాహానికి హాజరవుతుండడంతో ఎమ్మిగనూరుకు చెందిన వివిధ విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బుధవారం విద్యార్థి, యువజన సంఘాల నాయకులను అదుపులోకి తీసుకొని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయా సంఘాల నాయకులు రంగన్న యాదవ్, వీరేష్‌యాదవ్, ఉదయ్‌లతో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులకు నోటీసులు జారీ చేసి అరెస్టు చేశారు.

ముందస్తు అరెస్టుపై నాయకుల ఆగ్రహం

సీఎం జగన్ జిల్లాలో జరిగే పెళ్లి కార్యక్రమానికి వస్తున్న సందర్భంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వ, పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌కు విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులంటే అంత భయమెందుకో అర్థం కావడంలేదన్నారు. ఇంత భయపడుతూ పాలన ఎలా సాగిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు ఇంకిత జ్ఞానం లేకపోయినా.. ప్రజా, విద్యార్థి, యువజన సంఘాలనాయకులకు ఉందన్నారు. పెళ్లికి వచ్చిన ముఖ్యమంత్రిని ఎవరైనా అడ్డుకుంటారా.. అని అన్నారు. రాష్ట్రంలో 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అలాగే అన్ని శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. 30 రోజుల్లో టెట్, డీఎస్సీలను ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. విద్యార్థి యువజన సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ప్రభుత్వానికి నిరుద్యోగ యువత, ఉపాధ్యాయులు, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ప్రజల మద్దతు మా కుటుంబానికే

● సీటు కోసం సీఎం జగన్‌తో మాట్లాడతా
● మాజీమంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్వీ సుబ్బారెడ్డి

పత్తికొండ, ఫిబ్రవరి 14 : నియోజకవర్గ ప్రజల మద్దతు తమ కుటుంబానికి ఎప్పుడూ ఉంటుందని వచ్చేఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌వస్తే తన కూతురు నాగరత్నమ్మ తప్పక విజయంసాధిస్తుందని మాజీమంత్రి ఎస్వీసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం పత్తికొండలో వైసీపీ నాయకురాలు నాగరత్నమ్మ స్వగృహంలో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. 1994 నుంచి 2004 వరకు నియోజకవర్గంలో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలవడంలో ప్రజలతోపాటు తన అల్లుడు రామచంద్రారెడ్డి, కూతురు నాగరత్నమ్మ సహకారం తానుఎప్పుడూ మరిచిపోనన్నారు. నిజాయితీగా పనిచేసి నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేశానన్నారు. ప్రజలకోసం నిస్వార్థంగా కష్టపడిపనిచేయడం తన నుంచి తనకూతురుకు వారసత్వంగా వచ్చాయన్నారు. 2011లో వైసీపీలో చేరి 2014, 2019 ఎన్నికలలో పత్తికొండ ఎమ్మెల్యేబరికి దూరంగా ఉన్నా పార్టీగెలుపు కోసం నిరంతరంగా పనిచేస్తున్న నాగరత్నమ్మ పార్టీ ఎమ్మెల్యే సీటు ఆశించడం న్యాయమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ నాగరత్నమ్మ, రామచంద్రారెడ్డి పార్టీకిచేసిన సేవలు గుర్తించి టికెట్‌కేటాయిస్తారని నమ్ముతున్నానని పేర్కొన్నారు. టికెట్‌గురించి కుదిరితే ముఖ్యమంత్రి జగన్‌కు ఫోన్‌చేసి మాట్లాడతానన్నారు. ఆయనతోపాటు వైసీపీ నాయకులు నాగరత్నమ్మ, రామచంద్రారెడ్డి ఉన్నారు.

హంద్రీ వంకలోకి దూసుకెళ్లిన కంటైనర్

● ప్రాణాపాయం నుంచి బయటపడ్డ డ్రైవర్


హంద్రీవంకలోకి దూసుకెళ్లిన కంటైనర్

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 14: అర్ధరాత్రి చీకటిలో భారీ కంటైనర్ హంద్రీ వంకలోకి దూసుకెళ్లి పల్టీ కొట్టడంతో డ్రైవర్ ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించుకున్న ఘటన బుధవారం పత్తికొండ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు పత్తికొండ-ఆదోని రహదారిలో చిన్నహుల్తి రహదారిలో ఉన్న హంద్రీ వంక దగ్గర భారీ ప్రమాదం జరిగింది. మంగళవారం అర్ధరాత్రి దాటాక బుధవారం తెల్లవారుజామున మహారాష్ట్ర నుంచి గుత్తికి భారీ కంటైనర్ బయలుదేరింది. చిన్నహుల్తి సమీపంలో ఉన్న హంద్రీ వంకలోకి భారీ కంటైనర్ దూసుకెళ్లి వంకలో పల్టీలు కొట్టింది. డ్రైవర్ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. నిద్రమత్తులో ఉండటం వల్లనే బ్రిడ్జిని ఢీకొట్టి వంకలోకి కంటైనర్ పల్టీ కొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక పోలీసులు వంకలోకి పడిన కంటైనర్‌ను క్రేన్ ద్వారా బయటకు తీశారు.

జాతీయ స్థాయి క్రికెట్‌కు విజయ్‌కుమార్ ఎంపిక

మద్దికెర, జనవరి 14: మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన జిట్టా ఆంజనేయులు, సుశీలమ్మ దంపతుల కుమారుడు జిట్టా విజయ్‌కుమార్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు సూపర్-7 క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భాస్కర్ యాదవ్ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 10, 11 తేదీల్లో మద్దికెర గ్రామంలోని విద్యాసాయి కళాశాలలో రాష్ట్ర స్థాయి సూపర్-7 క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభను చూసి ఎంపిక చేశారని తెలిపారు. విజయ్‌కుమార్ డిగ్రీ చదువుతున్నారని, రాష్ట్ర స్థాయి పోటీల్లో వికెట్లతో పాటు అత్యధిక పరుగులు చేయడం వల్ల ఎంపిక చేశారని పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలలో బోటనీ ల్యాబ్ ప్రారంభం

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 14: ఆదోని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం బీఎస్సీ విద్యార్థుల కోసం బోటనీ ల్యాబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శివారెడ్డి మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు సైన్స్ పట్ల మరింత ఆసక్తి పెంచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. విద్యార్థులకు తమ సబ్జెక్టులో ప్రాక్టికల్స్ చేసుకోవడానికి అనువైన ల్యాబ్‌ను అన్ని వసతులతో ఏర్పాటు చేశామన్నారు. కళాశాలలో మరిన్ని సౌకర్యాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు. అనంతరం వసంతపంచమిని పురస్కరించుకొని సరస్వతి దేవికి పూజలు నిర్వహించారు.

ఎమ్మిగనూరు కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు

ఎమ్మిగనూరు , ఫిబ్రవరి 14: కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ కోసం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, పీసీసీ జనరల్ సెక్రటరీ కె. లక్ష్మీనారాయణరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో పార్టీ నాయకురాలు సీయోనాబోస్ కు దరఖాస్తును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. ఎమ్మిగనూరు నుంచి తాను విజయం సాధిస్తానని, ప్రజలు తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీసెల్ అధ్యక్షుడు సిరాలదొడ్డి ఖాజా, పట్టణ అధ్యక్షుడు గణేష్ పాల్గొన్నారు. ఇప్పటికే ఎమ్మిగనూరు టి కెట్ కోసం పట్టణానికి చెందిన మైనార్టీ నాయకుడు డీసీసీ కార్యదర్శి కాశింవలి సైతం దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఆశా వాహులు పెరుగుతుండడం గమనార్హం.

సీమలో వాల్మీకులకు తీవ్ర అన్యాయం : బీజేపీ

ఎమ్మిగనూరు , ఫిబ్రవరి 14: రాయలసీమలో ఉన్న 40లక్షల మంది వాల్మీకులు తీవ్ర అన్యాయానికి గురువుతున్నారని బీజేపీ ఓబీసీ మోర్చ జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం దైవందిన్నే గ్రామంలో ఏర్పాటు చేసిన మహర్షి వాల్మీకి విగ్రహాప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న వాల్మీకులు ఎస్సీలు, ఎస్టీలుగా ఉంటే రాష్ట్రంలో వాల్మీకులు బీసీలుగా ఉండటం దారుణమని పేర్కొన్నారు.

● దైవందిన్నేలో ఘనంగా మహర్షి వాల్మీకి విగ్రహాప్రతిష్ఠాపనః మండలపరిదిలోని దైవందిన్నే గ్రామంలో బుధవారం మహర్షి వాల్మీకి విగ్రహా ప్రతిష్ఠను గ్రామ పెద్దలు జానకి రామిరెడ్డి, సర్వేస్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు.

బతుకు బండి కదిలింది..

గోనెగండ్ల నుంచి కదిలిన వలస కూలీలు


ఆటోలలో కడపకు వలసలు వెళ్తున్న గోనెగండ్ల కూలీలు

గోనెగండ్ల, ఫిబ్రవరి 14: మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి నాలుగు రోజులుగా వలస బండ్లు కదులుతూనే ఉన్నాయి.. బుధవారం గోనెగండ్ల నుంచి దాదాపు 100 మంది వ్యవసాయ కూలీలు కడపకు బతుకు తెరువుకోసం ఆటల లో బయలు దేరారు. నాలుగు రోజులుగా గంజహళ్లి, గోనెగండ్ల, ఐరన్‌బండ, వేముగోడు, అగ్రహారం, బైలుప్పల గ్రామాల నుంచి హైదరాబాద్, బొంబాయి, గుంటురు, రంగారెడ్డి, రాజంపేట, కడప లకు వలసలు వెళ్తున్నారు. మండలంలోని పలుగ్రామాల నుంచి దాదాపు ఇప్పటి వరకు 6 వేల మంది వలసలు వెళ్లిన ట్లు తెలుస్తోంది. రాజంపేట, కడప ప్రాంతాల్లో పత్తి, వేరుశనగ పొలాల్లో పనులు చేసేందుకు వెళ్లారు. మరికొంత మంది హైదరాబాద్, బొంబాయి పట్టణాల్లో సిమెంట్, గృహనిర్మాణ పనులకు కూలీలుగా పనిచేసేందుకు వెళ్తున్నట్లు వలస కూలీలు చెబుతున్నారు. స్థానికంగా పంట పొలాల్లో పనులు ఉన్నపటికి కూలి గిట్టు బాటు కావడం లేదని కూలీలు వాపోతున్నారు.